సాక్షి
కామారెడ్డి
సోమవారం । 11 । ఆగస్టు । 2025





**అర్హులందరికీ ఇళ్లు..**
అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.
- 8లో ▸



**గుంతలమయం..**
మర్కల్ -తిర్మన్‌పల్లి గ్రామాల మధ్యనున్న జీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /22.2

**వాతావరణం**
ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### తెయూ ఇంజినీరింగ్ కళాశాలకు విద్యార్థుల కేటాయింపు

**తెయూ(డిచ్‌పల్లి):** నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు మూడో విడత కౌన్సిలింగ్‌లో 81 మంది విద్యార్థులను కేటాయించారని ప్రిన్సిపాల్ ఆరతి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌సీ)లో 65, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ)లో 9, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) విభాగంలో 4, డాటా సైన్సెస్ విభాగంలో ముగ్గురు విద్యార్థుల చొప్పున కన్వీనర్ కోటా ద్వారా కళాశాలకు కేటాయించారని పేర్కొన్నారు. ఇంటర్నల్ స్లైడింగ్ ద్వారా కొన్ని విభాగాల్లో విద్యార్థుల సంఖ్య మారే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇదే చివరి విడత కౌన్సిలింగ్ అని ప్రకటించినా కొత్తగా ఇంజినీరింగ్ కళాశాల కావడంతో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు


**నందిపేట్:** నందిపేట పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం సోమవారం ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ టీసీ, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, ఆధారు జిరాక్స్, 3 ఫొటోలతో పాటు రూ.6,180 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని సూచించారు.

### నేడు, రేపు సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు

**డిచ్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియను సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో మహిళలు, మంగళవారం ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో పురుషుల జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# గురుకులాల్లో వంటెలా?

- వస్తువుల సరఫరా కాంట్రాక్టు నిబంధనల్లో మార్పులు చేసిన సర్కారు
- బడా కాంట్రాక్టర్ల కోసమే అంటూ విమర్శలు
- ఆందోళనలకు సిద్ధమైన ప్రస్తుత సరఫరాదారులు
- వంట ఏజెన్సీలదీ ఇదే దారి..
- నేడు కలెక్టరేట్‌కు తరలివచ్చి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం
- 13 నుంచి సమ్మెబాట



వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాలతోపాటు కేజీబీవీల్లో అన్ని రకాల సరుకుల టెండర్ల నిబంధనల్లో సర్కారు చేసిన మార్పులపై ప్రస్తుత సరఫరాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిబంధనల మార్పు వందలాదిమంది పొట్టగొట్టేలా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారుపై ఒత్తిడి పెంచేందుకు సరుకుల సరఫరాదారులతోపాటు వంట ఏజెన్సీల నిర్వాహకులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. దీంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందిపడే అవకాశాలున్నాయి.

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు కూరగాయలు, పండ్లు, మేకపోతు మాంసం, స్కిన్‌లెస్ బాయిలర్ చికెన్ సరఫరాతో పాటు క్యాటరింగ్ కాంట్రాక్టు (వంట ఏజెన్సీలు) ఎంపిక కోసం నిబంధనల్లో మార్పులు చేసింది. ఫుడ్ ప్రొవిజన్స్‌ను జిల్లా యూనిట్‌గా, కూరగాయలు, పండ్లు, మటన్ (మేకపోతు), స్కిన్‌లెస్ చికెన్ (బాయిలర్) మండల యూనిట్‌గా కాంట్రాక్టులు ఇవ్వాలని నిర్ణయించింది.

#### ఒక్కరికే ఇస్తే..

జిల్లా మండల స్థాయిలలో కూరగాయలు, పండ్లు, మేక మాంసం, చికెన్ సరఫరా చేయడం అంత సులువు కాదనీ సరుకుల కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. మెనూ ప్రకారం మొదటి, మూడో ఆదివారం మధ్యాహ్న భోజనంలో మేకపోతు మాసం వండిపెట్టాలంటే ఉదయమే ఆయా పాఠశాలకు మాంసం సరఫరా చేయాలి. మండలం యూనిట్‌గా మాంసం టెండర్ ఒక్కరికే కట్టబెడితే ఆ మండలంలో ఉండే ఆరేడు పాఠశాలలకు క్వింటాళ్ల కొద్దీ మాంసం ఒకే వ్యక్తి సరఫరా చేయడం సాధ్యం కాదని పేర్కొంటున్నారు. అలాగే జిల్లా యూనిట్‌గా దాదాపు వంద పాఠశాలకు ఫుడ్ ప్రొవిజన్(కిరాణం) కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి అన్ని సరుకులను సజావుగా అందించే పరిస్థితి ఉండదంటున్నారు. స్థానికంగా ఉండే వారైతే అవసరమైన సామగ్రిని సకాలంలో చేరవేస్తారని, ఏదైనా వస్తువులు తక్కువ అయితే వెంటనే సర్దుబాటు చేయగలుగుతారని పేర్కొంటున్నారు. ఒకే గుత్తేదారుకు అప్పగిస్తే ఆ పరిస్థితి ఉండదంటున్నారు. ఇప్పుడున్న పద్ధతిలో దాదాపు వంద వరకు ఉన్న గురుకులాలు, కస్తూర్బాలకు దాదాపు 4 వందల మంది సరుకులు, వస్తువులు, కూరగాయలు, మాంసం సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే కొత్త విధానం ద్వారా వీరంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పాఠశాలల వారీ టెండర్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్యాటరింగ్ కాంట్రాక్టు జిల్లా కొనుగోలు కమిటీ నిర్ణయించిన ధరలకు ఆయా సరుకుల సరఫరా కోసం కాంట్రాక్టర్లను ఆహ్వానించారు.

#### కాంట్రాక్టర్లలో ఆందోళన..

టెండర్లలో సర్కారు తీసుకువచ్చిన మార్పులతో ప్రస్తుతం ఆయా సరుకులను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. టెండర్లు దక్కించుకోవాలంటే రూ.3 కోట్లకు పైగా టర్నోవర్ ఉండాలని, జీఎస్టీ లైసెన్సు కలిగి ఉండాలని, ట్రేడ్ లైసెన్సు, ఐదేళ్ల వ్యాపార అనుభవం, ఐటీ రిటర్న్స్ చెల్లించి ఉండాలన్న షరతులు ఉన్నాయి. ఇదే సమయంలో పండ్లు, కూరగాయల సరఫరా కాంట్రాక్టును ఒక్కరికే ఇవ్వనున్నారు. దీనిపైనా నిరసన వ్యక్తమవుతోంది. జిల్లా, మండల స్థాయిలో సరుకులను సరఫరా చేయాలంటే పెట్టుబడి రూ.కోట్లల్లో అవసరం ఉంటుంది. ఆ స్థాయి పెట్టుబడి పెట్టే స్తోమత తమలో ఏ ఒక్కరికీ లేదంటున్నారు. అంతేకాక మారిన నిబంధనలతో తమలో ఏ ఒక్కరికీ కాంట్రాక్ట్ దక్కే అవకాశం లేదని ప్రస్తుత కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

#### సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు..

సరుకుల సరఫరా టెండర్లలో సర్కారు తీసుకువచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ ప్రస్తుత సరుకు సరఫరాదారులు ఆందోళనకు సిద్ధమయ్యారు. తెలంగాణ సరుకుల సరఫరాదారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయనున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న సరఫరాదారులతో పాటు వంట ఏజెన్సీల నిర్వాహకులందరూ కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈనెల 13 నుంచి సరుకుల సరఫరా నిలిపివేసి సమ్మెబాట పట్టనున్నారు. సరుకుల సరఫరాదారులతో పాటు వంట ఏజెన్సీలు కూడా సమ్మెలో పాల్గొననున్నాయి. దీంతో జిల్లాలోని ఆయా పాఠశాలలకు సామగ్రి, కూరగాయలు, పండ్లు, మాంసం సరఫరా నిలిచిపోనున్నాయి. వంట చేసేవారు కూడా సమ్మెకు వెళ్తుండడంతో విద్యార్థులకు భోజనాలు సమకూర్చడం సమస్యగా మారనుంది.

■ మూడు వారాల క్రితం ముగ్గురు యువకులు రాత్రి వేళ బైక్‌పై వెళ్తూ పెద్దకొడప్‌గల్ మండలం పోతారం గేటు వద్ద ఆగి ఉన్న ఓ గూడ్స్ వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టారు. తలకు బలమైన గాయాలు కావడంతో ముగ్గురూ అక్కడికక్కడే చనిపోయారు.

■ వారం క్రితం కామారెడ్డిలోని స్టేషన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు వెనక నుంచి వచ్చి టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే చనిపోయారు. ఆయా ఘటనల్లో హెల్మెట్ పెట్టుకుని ఉంటే ప్రాణాలు దక్కేవన్న అభిప్రాయాన్ని అక్కడున్న వారంతా వ్యక్తం చేశారు.

# మారని ద్విచక్ర వాహనదారులు

నిర్లక్ష్యం, చిన్నచిన్న పొరపాట్ల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిలో ప్రధానంగా తలకు బలమైన గాయాలు కావడంతో చాలామంది చనిపోతున్నారు. ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే ఉన్నాయి.

#### తగ్గని రోడ్డు ప్రమాదాలు

- తలకు బలమైన గాయాలతో అనేక మరణాలు..
- హెల్మెట్ ధరిస్తే మరణాల రేటు తగ్గే అవకాశం
- అవగాహన కల్పిస్తున్నా వాహనదారులది అదే నిర్లక్ష్యం
- ప్రాధాన్యతను గుర్తించాలంటున్న పోలీసులు



**కామారెడ్డి క్రైం :** జిల్లావ్యాప్తంగా గతేడాది 525 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిలో 274 మంది చనిపోగా 475 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 282 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 132 మంది చనిపోగా, 268 మంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు 80 శాతానికిపైగా తలకు బలమైన గాయాలు కావడంతోనే మరణాలు సంభవిస్తున్నాయి.

**ప్రచారం చేస్తున్నా..**

జిల్లా పోలీసు శాఖ ఇటీవలి కాలంలో హెల్మెట్ ప్రాధాన్యతపై దృష్టి సారించింది. వాహనాల తనిఖీలు పెంచారు. హెల్మెట్ ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనల అమలుపై అవగాహన కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారంలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024 లో చేపట్టిన వాహనాల తనిఖీల్లో హెల్మెట్ ధరించని 2,46,880 మందికి జరిమానాలు విధించారు. ఈ యేడాది జూలై నాటికే 2,00,896 హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్నవారికి జరిమానాలు పడ్డాయి. వాహనదారులు హెల్మెట్ ధరించేలా చేయాలనేది పోలీసు శాఖ ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ప్రజలు కూడా హెల్మెట్ ప్రాముఖ్యతను గుర్తించాలని కోరుతున్నారు. ఇంత చేస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. పెరుగుతున్న జరిమానాలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనదారులు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

> **విలువైన ప్రాణాలను కాపాడుకోవాలి..**
>
> రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో జరుగుతున్న మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ప్రమాదాలలో మరణాలను నివారించడానికి ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. విలువైన ప్రాణాలను కాపాడుకోవాలి. దీనిపై పోలీసు శాఖ తరఫున విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. వాహనాల తనిఖీలు కూడా పెంచాం.
>
> – రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

# రోడ్లపై నిలుస్తోన్న వాన నీరు

- కేకేవై రహదారిలో వాహనదారులకు ఇబ్బందులు

**కామారెడ్డి అర్బన్:** కామారెడ్డి పట్టణం గుండా వెళ్లే కేకేవై (కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి) వంద ఫీట్ల రోడ్డు కబ్జాలతో ఇరుకుగా మారి ఓవైపు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ దారిలో డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం కురిస్తే రోడ్డుపైనే నీరు నిలిచి మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. వంద ఫీట్ల కేకేవై రోడ్డు పట్టణంలో సిరిసిల్లరోడ్డు, స్టేషన్‌రోడ్డు, పోలీసు స్టేషన్, రైల్వే బ్రిడ్జి మీదుగా ఉంది. ఈ రోడ్డులో ఎక్కడికక్కడ అక్రమ కట్టడాలతో కబ్జా చేశారు. సిరిసిల్ల రోడ్డులో రామేశ్వరపల్లి వెళ్లే జాతీయ రహదారి సర్వీసు రోడ్డు సైతం ఇలాగే వాన నీటితో నిండిపోయింది. జాతీయ రహదారి నిర్వాహకులు మూసుకుపోయిన మురికి కాల్వల్లో మట్టిని తొలగించకపోవడంతో నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



స్టేషన్‌రోడ్డులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలిచిన నీరు

# వన మహోత్సవం లక్ష్యం నెరవేరేనా?

- నర్సరీల్లో అరకొరగానే మొక్కలు
- పట్టించుకోని అధికారులు

**నిజాంసాగర్ :** వర్షాకాలం సీజన్‌ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయినా జిల్లాలో ఇప్పటికీ మొక్కలు నాటే కార్యక్రమం జోరందుకోలేదు. దీంతో జిల్లా వన మహోత్సవం లక్ష్యానికి దూరంగానే ఉండిపోయింది. ప్రతి పంచాయతీ పరిధిలో నాలుగు వేల మొక్కలు నాటాలని ముందుగా నిర్ణయించారు. అయితే సరైన వర్షాలు లేకపోవడంతో లక్ష్యాన్ని సగానికి తగ్గించారు. ఈనెలాఖరు వరకు ప్రతి పంచాయతీలో 2 వేల మొక్కలు నాటాల్సి ఉన్నా ఎక్కడా వన మహోత్సవం సరిగా సాగుతున్న దాఖలాలు లేవు. మరోవైపు నర్సరీలలోనూ మొక్కల పెంపకం తూతూమంత్రంగానే సాగింది. ప్రతి నర్సరీలో 4 వేల మొక్కలను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నా.. చాలాచోట్ల అరకొరగానే మొక్కలున్నాయి. వన మహోత్సవంపై పంచాయతీ అధికారులు, ఈజీఎస్ సిబ్బంది శ్రద్ధ చూపకపోవడంతో నర్సరీల నిర్వహణ అధ్వానంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి.



నర్సింగ్‌రావ్‌పల్లి నర్సరీలో మొక్కలు లేక ఖాళీగా ఉన్న విత్తన బ్యాగ్‌లు

# రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పతకాల పంట




పోటీల్లో పతకాలు, ప్రశంస పత్రాలు పొందిన క్రీడాకారులతో జిల్లా యోగా అసోసియేషన్ ప్రతినిధులు

**కామారెడ్డి అర్బన్ :** ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఈ పోటీల్లో జిల్లాకు ఎనిమిది పతకాలు వచ్చాయని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి తెలిపారు. డి.సురేందర్ బ్యాక్ బెండింగ్ విభాగంలో బంగారు, ట్రెడిషన్ విభాగంలో రజత పతకాలు సాధించారని పేర్కొన్నారు. సీహెచ్.రాజ్‌కుమార్ ట్విస్టింగ్, సుపైన్‌లో కాంస్యం, ఫార్వర్డ్ బెండింగ్‌లో వెండి పతకాలు, యు.అనిల్‌కుమార్ ఫార్వర్డ్ బెండింగ్‌లో కాంస్యం సాధించారని తెలిపారు. సీహెచ్.తిరుపతి హ్యాండ్ బ్యాలెన్స్‌లో కాంస్యం, ఏ.రాజు ట్రెడిషన్ విభాగంలో వెండి పతకాలు సాధించారని వివరించారు. మరికొందరు క్రీడాకారులు ప్రశంస పత్రాలు అందుకున్నారన్నారు.



# నిజాంసాగర్‌లోకి 5,393 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టు తాజా నీటిమట్టం



కల్యాణి ప్రాజెక్టు గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

**నిజాంసాగర్:** ఎగువన మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 5,393 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ అక్షయ్ తెలిపారు. ఘణపురం ఆనకట్ట పొంగి పొర్లుతుండడంతో 2,917 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందన్నారు. అలాగే సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 600 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,391.5(4.723 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

#### 'కల్యాణి'లోకి 250 క్యూసెక్కులు..

**ఎల్లారెడ్డిరూరల్:** తిమ్మారెడ్డి గ్రామ శివారులోని కల్యాణి ప్రాజెకులోకి ఆదివారం 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులు కాగా.. 408.50 అడుగుల నీటిని నిలువ ఉంచుతున్నారు. ఇన్‌ఫ్లో నీటిలో 179 క్యూసెక్కులను నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లిస్తుండగా.. 71 క్యూసెక్కులను ఒక వరద గేటు ఎత్తి మంజీర నదిలోకి వదులుతున్నారు.

#### ఉధృతంగా ప్రవహిస్తున్న ఎడ్లకట్ట వాగు

**బీబీపేట:** ఎగువన కురుస్తున్న వర్షాలతో జనగామ – మాందాపూర్ గ్రామాల మధ్యనున్న ఎడ్లకట్ట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వాగులో నుంచి ఎవరూ దాటే ప్రయత్నం చేయకుండా బందోబస్తు నిర్వహించారు. బీబీపేట పెద్ద చెరువుకు ప్రధానంగా ఎడ్లకట్ట వాగే ఆధారం. ఈ వాగు ప్రవహిస్తుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.



ఎడ్లకట్ట వాగు ప్రవాహం

**చెరువుల్లోకి నీరు..**

**తాడ్వాయి:** మండలంలో నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారుతున్నాయి. కృష్ణాజీవాడి చెరువు అలుగు పారుతోంది. మండలంలో మక్క, పత్తి, సోయా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ పంటలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## క్లుప్తంగా

### రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్/సదాశివనగర్/బీబీపేట/భిక్కనూరు/రాజంపేట/ కామారెడ్డి అర్బన్/తాడ్వాయి/లింగంపేట : జూన్ 5వ తేదీ వరకు పట్టాపాసు పుస్తకం వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని పలు మండలాల వ్యవసాయాధికారులు ఆదివారం కోరారు. ఈఅవకాశం ఆగస్టు 13 వరకు ఉందని, రైతుబీమా పథకంలో నామినీ పేరు మార్చుకోవడానికి ఈనెల 12లోపు అవకాశం ఉన్నట్లు బాన్సువాడ, సదాశివనగర్, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట, తాడ్వాయి, లింగంపేట మండలాల వ్యవసాయాధికారులు ఫైజుల్లా, ప్రజాపతి, నరేందర్, వినోద్‌గౌడ్, శృతి, నర్సింలు, రాకేశ్, అడ్లూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.దేవేంద్ర లు తెలిపారు. రైతులు దరఖాస్తు ఫారం, రైతు పట్టాపాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లు సమర్పించాలని తెలిపారు. రైతులు గ్రామాల్లోని క్లస్టర్ రైతువే దికల్లో ఏఈవోలను సంప్రదించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

### ఉప్లూర్ చెరువులో మొసలి



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ నల్ల చెరువులో ఆదివారం ఉదయం మొసలి కనిపించడం కలకలం రేపింది. చెరువు మధ్యలో నీటిపై ఏదో కదులుతున్నట్లు కనిపించడంతో స్థానిక రైతుతు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు. మొసలి కావడంతో గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో ఈ విషయం కలకలం రేపుతోంది. చెరువు విస్తీర్ణం పెదద్దిగా ఉండడంతో మొసలి ఎటు వైపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు నాలుగు నెలల క్రితం కూడా చెరువులో మొసలి కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి మొసలిని పట్టుకొని బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### జై కిసాన్ మున్నూరు కాపు సంఘం ఏకగ్రీవ ఎన్నిక

రుద్రూర్: మండల కేంద్రంలోని జై కిసాన్ మున్నూ రు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి పార్వతి శేఖర్ తెలిపారు. అధ్యక్షుడిగా కర్క అశోక్, ఉపాధ్యక్షులుగా గుర్ల గోపి, పార్వతి ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా పి.రోహిత్, డి. రవి, గౌరవ సలహాదారులుగా పత్తి రాము, ఉప్పు గంగాధర్, నాగం అశోక్, దుర్కి సాయన్న, పార్వతి మురళి, పి. రాములను ఎన్నుకున్నట్లు వివరించారు.

### 'ఎత్తిపోతల' నిర్వహణకు నూతన కమిటీ



బోధన్: సాలూర మండల కేంద్రంలోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం నిర్వహణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఆవరణలో రైతులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా సొసైటీ మాజీ చైర్మన్ బాసర శివకాంత్ పటేల్, ఉ పాధ్యక్షుడిగా ఇల్తెపు సాయన్న, కార్యదర్శిగా సరిడే సాయిలు, కోశాధికారిగా మామిడి శ్రీను, సభ్యులు గా ముట్టిన్ గంగారాం, శ్రీకాంత్, సంగెం భూమ య్య, ఎంఏ ఖదీర్, గంటే లక్ష్మణ్, మల్లెపూల లక్ష్మ ణ్, నీరడి నగేష్, కోటగిరి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

# బకాయిల 'పంచాయితీ'

- బ్లీచింగ్ పౌడర్, వీధిలైట్లు జీపీకి సరఫరా చేసిన వ్యాపారులు
- రూ.16 లక్షల బకాయిలు
- మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన బిచ్కుంద పంచాయతీ
- పాత బకాయిలతో సంబంధం లేదంటున్న మున్సిపల్ అధికారులు
- ఆందోళనలో వ్యాపారులు



బిచ్కుంద భద్రాల తండాలో మరమ్మతులకు నోచుకోని సింగిల్ ఫేజ్ మోటర్

బిచ్కుంద(జుక్కల్) : బిచ్కుంద జీపీ నుంచి నూతన మున్సిపాలిటీగా ఏర్పడింది. నాలుగు నెలల క్రితం మున్సిపల్ అధికారులు జీపీ రికార్డులు స్వాధీనం చేసుకొని బాధ్యత తీసుకున్నారు. ఈక్రమంలో జీపీ బకాయిలు మున్సిపల్ కు సంబంధంలేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పడక ముందు ఏడాదిన్నరలో బోరు మోటర్ల మరమ్మతులు, ట్రాక్టర్ చెత్త సేకరణ డీజిల్, పారిశుధ్య పనులు, క్లోరినేషన్ కోసం బ్లీచింగ్ పౌడర్, వీధిలైట్లు జీపీకి వ్యాపారులు సరఫరా చేశారు. ఈ బకాయిలు సుమారు రూ. 16 లక్షలు ఉన్నాయి. బోరు మెకానిక్‌లు, బ్లీచింగ్ పౌడర్, బల్బులు ఇచ్చిన వ్యాపారులు డబ్బుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. జీపీ పాత బకాయిలు చెల్లించడానికి మున్సిపల్ శాఖకు అనుమతులు ఉండవని, చిల్లిగవ్వ చెల్లించమని మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం చెప్పడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వీటికి ఎంబీ రికార్డులు ఉండవు మీ బకాయి డబ్బులు రావని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. సొంత డబ్బులు పెట్టి బోర్లు మరమ్మతులు చేశామని రూ. రెండు లక్షలు బకాయిలు ఉన్నాయని ఓ మెకానిక్ వాపోయాడు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ స్పందించి బోరు మెకానిక్, బ్లీచింగ్ పౌడర్, వీధి లైట్లు, పైపు లైన్ల మరమ్మతుల పాత బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

### బోరు మరమ్మతులకు ముందుకు రాని మెకానిక్‌లు..

పాత బకాయిలు ఇవ్వకపోవడంతో బోరు మోటార్లు మరమ్మతులు, వీధిలైట్లు, పైపులైన్ మరమ్మతులు చేయడానికి మెకానిక్‌లు ముందుకు రావడం లేదు. చెడిపోయిన సింగిల్ ఫేజ్ మోటార్లు మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ అధికారులు తీసుకెళ్లారు. 13,14,15,16 వార్డులలో మూడు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు మోటారు బిగించలేదు. కొన్ని చోట్ల చెడిపోయిన మోటర్‌లను బోరులో నుంచి కనీసం తీయకుండా వదిలేశారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. మున్సిపల్‌లో విలీనమై జీపీ గ్రామాలు గోపన్‌పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్ బిచ్కుంద నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామ ప్రజలు సమస్యలు తెలపడానికి బిచ్కుంద మున్సిపల్ కార్యాలయానికి రావాలి. మున్సిపల్ 12 వార్డులకు ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లను వార్డు ఆఫీసర్లుగా నియమించారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. మోటర్లు, వీధిలైట్లు బిగించి డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయిస్తాం..

జీపీ పాత బకాయిలు మున్సిపల్ కార్యాలయానికి సంబంధం లేదు. జీపీ పాత బకాయిలు చెల్లించాలని మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. బకాయిల కోసం వచ్చిన వ్యాపారులకు చెల్లించమని చెప్పాం. వార్డు ఆఫీసర్లుగా ముగ్గురు సిబ్బందికి బాధ్యతలు అప్పగించాం. ఒక్కొక్కటిగా మోటరు మరమ్మతులు చేసి బిగిస్తున్నాం.

– ఖయ్యూం, కమిషనర్, మున్సిపల్ బిచ్కుంద

# కలుషితమవుతున్న మత్తడి వాగు నీరు

- బాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు కాలువద్వారా వాగులోకి..
- నీరు తాగి రోగాల బారిన పడుతున్న పశువులు



సదాశివనగర్ వద్ద కాలువ ద్వారా వాగులో కలుస్తున్న వ్యర్థపు నీరు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థ పదార్థాలను అటవీ ప్రాంతంలో ఉన్న వాగులోకి వదిలేస్తున్నారు. బాయిల్డ్ మిల్లు నుంచి వెలువడుతున్న వ్యర్థ పదార్థాలను నేరుగా ఒక కాలువ ద్వారా వాగులోకి వదులుతున్నారు. మిల్లుల నుంచి వెలువడుతున్న కలుషిత నీటితో ఆ ప్రాంతంలో ఉన్న పంట భూముల్లో సైతం కలుషిత నీరు పారుతుందని రైతులు వాపోతున్నారు. మిల్లులు ప్రారంభం కాక ముందు ఇంతలా వ్యర్థపు నీరు వదలలేదని, గత ఏడాది కాలంగా భారీగా వ్యర్థపు నీటిని వదులుతున్నారని ఆ ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను అరికట్టాలని గతంలో ప్రజావాణిలో సైతం ఫిర్యాదులు ఇచ్చిన ఎలాంటి స్పందన లేదని రైతులు చెబుతున్నారు. ఈకలుషిత నీటిని తాగిన పశువులు రోగాల బారిన పడుతున్నాయని పశువుల కాపరులు చెబుతున్నారు. గతంలో అటవీ ప్రాంతంలో కేవలం మత్తడి వద్ద పుష్కలమైన నీరు లభించేదని, ఇప్పుడు నీరు వ్యర్థాలతో ప్రమాదకరంగా ఉందన్నారు. కాలుష్య నియంత్రణ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థాపు నీటిని అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### రోడ్డుపై నిలుస్తోన్న నీరు



బుడిమి గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం బుడమి గ్రామ ముఖద్వారం వద్ద వర్షం పడినప్పుడల్లా రోడ్డుపై వారం రోజుల పాటు వర్షపు నీరు ని లిచి ఉంటుంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, నీటి ప్రవాహానికి అధికారులు తాత్కాలిక ఏర్పాటు చేయకపోవడంతో నీళ్లు నిలిచి ఉంటున్నాయి. ఊర్లోకి వెళ్లాలంటే నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిందే. నిల్వనీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడకముందే అధికారులు, గ్రామస్తులు స్పందించి తగు చర్యలు తీసుకోవావాలి.

# కట్టడి చేసినా.. గంజాయి సరఫరా..

- పొరుగు జిల్లాల నుంచి బాల్కొండ నియోజకవర్గ గ్రామాలకు సప్లయ్
- పోలీసులు పట్టుకుంటున్నా వెరవని స్మగ్లర్లు



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో గంజాయి కట్టడికి పోలీసులు ఎంత ప్రయత్నం చేస్తున్నా.. స్మగ్లర్లు ఏదో ఒకవిధంగా తమ దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలోగల పలు గ్రామాలకు పొరుగు జిల్లాల నుంచి గంజాయి సరఫరా కొనసాగుతోంది. నిందితులను పోలీసులు పట్టుకుంటూ, గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నా స్మగ్లర్లు దందాను ఆపడం లేదు.

**ఇదీ పరిస్థితి..**

బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పొరుగు జిల్లాలైన జగిత్యాల్, నిర్మల్‌ల నుంచి గంజాయి స్మగ్లర్లు వచ్చి తమ దందాను కొనసాగిస్తున్నారు. తాజాగా కమ్మర్‌పల్లిలో పోలీసులు మెట్‌పల్లికి చెందిన నాంపల్లి వికాస్‌ను అతడికి సహకరిస్తున్న స్థానికుడైన షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం పరిశీలిస్తే పొరుగు జిల్లాల నుంచి గంజాయి దిగుమతి అవుతుందని వెల్లడవుతోంది. నాంపల్లి వికాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడికి గంజాయి అందించేవారు ఎవరు? ఎంత మొత్తంలో సరఫరా చేస్తారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. గంజాయి దందాకు కీలకమైన వ్యక్తులను పట్టుకుంటేనే ఈ దందాను పూర్తిగా అంతమొందించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

**కౌన్సెలింగ్ ద్వారానే మార్పు..**

గంజాయికి బానిసలైన యువకులను గుర్తించి వారికి, వారి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తేనే గంజాయికి పూర్తిస్థాయిలో చెక్ పెట్టవచ్చనే వాదన బలంగా వినిపిస్తోంది. గతంలో మోర్తాడ్ ఎస్సైగా పనిచేసిన సంపత్ గంజాయికి బానిసలైన వారితో పాటు వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు రప్పించి అందరి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి కౌన్సెలింగ్ ద్వారానే యువతలో మార్పు తీసుకరావాలని పలువురు సూచిస్తున్నారు.

### ఎవరు విక్రయించినా ఉపేక్షించం

గంజాయిని ఎవరైన, ఎక్కడైన విక్రయిస్తే ఉపేక్షించేది లేదు. గంజాయి విషయంలో మా యంత్రాంగం సీరియస్‌గా ఉంది. గంజాయి విక్రయించేవారి గురించి సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. ప్రజల సహకారంతోనే గంజాయిని నిర్మూలించడం సాధ్యమవుతుంది.

– సత్యనారాయణ, సీఐ, భీమ్‌గల్

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తాం



ఎల్లారెడ్డిలో చిన్నారులకు గోధుమ బుట్టలను అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

- ఇళ్లు మంజూరు కాని వారు ఆందోళన చెందొద్దు
- పలు చోట్ల తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమెల్యే మదన్‌మోహన్ రావు



గండివేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గాంధారి(ఎల్లారెడ్డి) : నియోజకవర్గం పరిధిలో అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. గండివేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని వారు ఆందోళన చెందరాదన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి బేస్‌మెట్ లెవెల్ పనులు పూర్తయిన లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయన్నారు. అనంతరం గండివేట్ తండాలో నిర్వహించిన తీజ్‌వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనతో పాటు మండల పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

**కామారెడ్డిలో బంజారా సంఘం ఏర్పాటుకు కృషి చేస్తా**

ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంలో బంజారా సంఘం భవనం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రావణమాసంలో గిరిజన మహిళలు ఉపవాస దీక్షలు చేసి గోధుమ బుట్టలను పూజించడం జరుగుతుందన్నారు. నాగిరెడ్డిపేటలో బంజారా భవనం ఏర్పాటు చేస్తానని అన్నారు. అనంతరం బంజారా సంఘం నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, మహిళలు గోధుమ బుట్టలతో పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్, జిల్లా అధ్యక్షులు సురేందర్‌నాయక్, మోతి సింగ్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట బంజారా సంఘం అధ్యక్షులు రాములు, రమేష్, బంజారా సంఘం నాయకులు సంగ్రాం, గణేష్, సర్దార్, సంతోష్, మున్సిపల్ మాజీ చైర్మెన్లు కుడుముల సత్యనారాయణ, పద్మ శ్రీకాంత్, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సామెల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

**పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి**

లింగంపేట(ఎల్లారెడ్డి): పెద్దమ్మతల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణం, అభివృద్ధి కోసం తాను పూర్తి సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్, మండల అధ్యక్షుడు సాయికుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్, కార్యవర్గ సభ్యులు కిష్టయ్య, సిద్దిరాములు, పోచయ్య, సాయిలు, బాలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ కుల స్తులు పాల్గొన్నారు.

### ఎస్సారెస్పీలోకి గుర్రపు డెక్క



ఎస్సారెస్పీ నీటిలో తేలియాడుతున్న గుర్రపు డెక్క

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటితో పాటు గుర్రపు డెక్క కొట్టుకువస్తోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిలో గుర్రపు డెక్క మొక్కలు భారీగా పేరుకుపోగా, కొన్ని ఆనకట్ట అంచున వచ్చిచేరాయి. గుర్రపు డెక్క పేరుకుపోతే ఆనకట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గుర్రపు డెక్కతో అనర్థాలు..**

గుర్రపు డెక్క నీటిలో పెరిగే కలుపు మొక్క. ఇది వేగంగా పెరిగి నీటి వనరులను మూసుకు పోయేలా చేస్తుంది. దీని వలన నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుంది. ప్రాజెక్ట్ అనకట్ట అంచున గురప్రుడెక్క పేరుకుపోతే రివిట్‌మెంట్‌లోకి నీరు అధికంగా వెళ్లి అనకట్టకు గండి పడే ప్రమాదం ఏర్పడుతుంది. చేపల పెంపకానికి అంటకంగా మారుతుంది. దీని వలన అధికంగా దోమలు, ఇతర కీటకాలు పెరిగి నీటి నాణ్యతను దెబ్బతీస్తుంది. గుర్రపు డెక్క నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తుంది. వ్యాధుల వ్యాప్తికి కారణమవుతుంది. ఒక్కసారి నాటుక పోతే తొలిగించడానికి చాలా ఖర్చు అవుతుంది. దీంతో ఆర్థికంగా కూడ తీవ్రంగా ప్రభావం చూపుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్ట అంచున పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

### ఏజెంట్ల మోసంపై విచారణ

- దుబాయ్‌లో చిక్కుకున్న జిల్లావాసితో మాట్లాడిన ఎంబసీ అధికారులు
- వేల్పూర్‌లోనూ పోలీసుల ఆరా



దుబాయ్‌లో చిక్కుకుపోయిన గంగాప్రసాద్

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏజెంట్ల మోసానికి గురికాగా, ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ విచారణ ప్రారంభించింది. వివరాలు ఇలా.. వేల్పూర్ మండలం పడి గెల వాసి గంగా ప్రసాద్ యూర ప్ వెళ్లే ప్రయత్నంలో ఏజెంట్ల మోసానికి గురై దుబాయ్‌లో మూడేళ్ల నుంచి ఇబ్బందికరమైన పరిస్థితిలో ఉండిపోయాడు. ఏజెంట్లు బాధితుడి నుంచి రూ.8.77 లక్షలు వసూలు చేసి టోకరా వేసిన విషయం విధితమే. ఈ విషయంపై బాధితుడి తండ్రి భోజన్న ఇటీవల ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. మరోవైపు గంగాప్రసాద్ సామాజిక మాధ్యమం ద్వారా ఎంపీ అర్వింద్ కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీంతో రెండ్రోజుల క్రితం దుబాయ్‌లో ఉన్న గంగాప్రసాద్‌ను విదేశాంగశాఖ అధికారులు ఎంబసీకి పిలిపించుకున్నారు. వారు ఏజెంట్ల పేర్లు, వారి వివరాలను నమోదు చేసుకున్నట్లు బాధితుడు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. తన వీసా గడువు ముగిసిపోగా ఈ అంశంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారన్నారు. మరోవైపు ప్రవాసీ ప్రజావాణి లేఖ మేరకు విచారణ చేపట్టాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్‌ను సీపీ సాయి చైతన్య ఆదేశించారు. దీంతో సదరు ఏజెంట్ల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

### చీరల చోరీకి పాల్పడిన నిందితుల పట్టివేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ వస్త్రదుకాణంలో చీరల చోరీకి పాల్పడిన నిందితులను స్థానికులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. భిక్కనూరులోని గాంధీచౌక్ వద్ద గల ఓ వస్త్ర దుకాణంలోకి ఆదివారం ఓ మహిళ, యువకుడితో కలిసి వచ్చింది. దుకాణ యజమానిని వారు చీరలను చూపించమని చెప్పారు. దీంతో యజమాని చీరలను చూపించగా, వారు బేరం ఆడుతున్నట్లు నటించి, ఓ చీరను వారి బ్యాగులో వేసుకున్నారు. అనంతరం ధర గిట్టుబాటు అవడంలేదంటూ వారు అక్కడినుంచి వెళ్లిపోయి మరో వస్త్ర దుకాణంలోకి చేరారు. కొద్దిసేపటికి మొదటి దుకాణ యజమాని చీర చోరీని గుర్తించి, వారి వద్దకు వెళ్లి నిలదీశాడు. మహిళతో ఉన్న యువకుడు మద్య తాగి ఉండటంతో దుకాణ యజమాని బెదిరించాడు. దీంతో స్థానికులు అతడిని చితకబాది, మహిళకు చివాట్లు పెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ అరేంజ్ ద బ్యాంక్ గ్యారెంటీ బిల్డర్స్ రియల్టర్స్ స్కైపర్ టవర్స్ కన్‌స్ట్రక్షన్స్, డైమండ్స్, జ్యూవెలరీ, బిజినెస్, కోల్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్స్ ఫార్మర్స్. 9849161889. [SCA25007194]

WANTED

■ మీనాక్షి మోటార్స్ బజాజ్ షోరూం బోధన్‌లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, వర్క్ షాప్ మేనేజర్, టెలికాలర్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. 9440414119. [SCA25007097]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్రైం కార్నర్

### డ్రెయినేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద గల డ్రెయినేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. మురికి కాలువలో మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటన స్థలానికి వచ్చి పరిసరాలను పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అడి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటాయని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

### చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని నెహ్రూనగర్ బస్టాండ్ దగ్గర నెల రోజుల క్రితం ఒక గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్య సమస్యలతో అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. అతడిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు యాభై ఏళ్లు ఉంటాయని, ఎవరైనా అతడిని గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో గాని, లేదా 8712659848, 8712659734కు సంప్రదించాలన్నారు.

### చోరీకి గురైన బైక్ రికవరీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): చోరీకి గురైన బైక్‌ను నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా.. మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి అనుమానాస్పదంగా బైక్‌పై వెళుతుండగా పోలీసులు అతడిని ఆపారు. వివరాలు సేకరించగా బైక్‌ను చోరీ చేసి తీసుకువస్తున్నట్లు అతడు పేర్కొన్నాడు. వెంటనే పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకొని, వాహన యజమానికి సమాచారం అందించారు. పట్టుబడ్డ నిందితుడిని కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

### పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

సిరికొండ: మండల కేంద్రం శివారులోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట శివారులో గల పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు దాడి చేశారు. గ్రామశివారులో పేకాట ఆడుతున్నారని తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు నలుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి మూడు సెల్‌ఫోన్లతో పాటు రూ.1,610 నగదును సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. మండలంలో ఎక్కడా పేకాట ఆడినా తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

**కామారెడ్డిలో...**

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలోగల ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురిని పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.29,910 నగదును, 6 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

# మద్యంమత్తులో యువకుడి వీరంగం

- ముగ్గురిపై కల్లుసీసాతో దాడి
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన రూరల్ పోలీసులు





గాయపడిన దీపిక, శైలేందర్

నిజామాబాద్ రూరల్: మండలంలోని గూపన్‌పల్లి గ్రామంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించి, ముగ్గురిపై దాడిచేసి గాయపర్చాడు. నిందితుడిని పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మదన్ అనే వ్యక్తి శనివారం రాత్రి కల్లుబట్టిలో మద్యం తాగి సమీపంలో గల అనిల్ అనే వ్యక్తి ఇంటి ఎదుట నిద్రించాడు. కొద్దిసేపటికి ఇంటికి చెందిన అనిల్, శైలేందర్‌లు ఇంట్లోకి వెళుతుండగా మదన్‌కు కాళ్లు తగలడంతో మేల్కొన్నాడు. దీంతో మదన్ వారితో వాగ్వాదానికి దిగాడు. అనంతరం మదన్ పగిలిన కల్లుసీసాతో శైలేందర్ ఎడమచేతిని గాయపరిచారు. అనిల్, అతడి అక్క దీపిక అడ్డురావడంతో మదన్ వారిపై సైతం దాడిచేసి గాయపర్చారు. వెంటనే గ్రామ పెద్దలు ఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనపై బాధితులు మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### వృద్ధురాలి ఆత్మహత్య

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చందాల లక్ష్మీ(63) అనే వృద్ధురాలు గత కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఒంటరిగా నివసించడంతో తీవ్ర మనోవేదనకులోనై తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**హాస్టల్ వార్డెన్..**



షబానా (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహం వార్డెన్ షబానా ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన షబానా గత సంవత్సరం ఆగస్టులో ఆర్మూర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో విధుల్లో చేరింది. ఆర్మూర్ పట్టణంలోనే ఉంటూ విధులు నిర్వహిస్తుండేది. కాగ రెండు రోజులు సెలవులు రావడంతో ఆమె జగిత్యాలలోని ఆమె ఇంటికి వెళ్లింది. ఆమె స్వగృహంలో శనివారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది.ఈ ఘటనపై తోటి ఉద్యోగులు, హాస్టల్ విద్యార్థినులు విచారం వ్యక్తం చేశారు.